చార్మినార్‌లో కాంగ్రెస్ రోడ్ షో..



అలీ మస్కతిని సత్కరించి ఆశీర్వాదం పొందుతున్న మహ్మద్ వలీ ఉల్లా సమీర్

చార్మినార్: చార్మినార్ శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం చార్మినార్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలీ ఉల్లా సమీర్ ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. ముందుగా మక్కా మసీదులో జుమ్మా సామూహిక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం ఆయన రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై జెండాలు పట్టుకుని దారిపొడవునా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కోట్ల అలీజాలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మస్కతి డైరీ ప్రొడక్ట్స్ మేనేజింగ్ పార్టనర్ అలీ మస్కతి వద్దకు వెళ్లి ఆయనను సత్కరించి ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హైదరాబాద్ ఓటర్లు ఈసారి తనను గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఏళ్ల తరబడి మజ్లిస్ పార్టీని గెలిపిస్తున్నప్పటికీ..పాతబస్తీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని..అందుకే ఆరు గ్యారంటీల అమలుతో అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్న కాంగ్రెస్ పార్టీని గెలిపించడానికి ఎదురు చూస్తున్నారన్నారు.

మురుగుమయం..
రోగాల భయం

- మేకలమండి-సర్దార్ పటేల్‌నగర్‌లో 25 రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- సమస్య పరిష్కరించాలంటున్న స్థానికులు



మేకలమండి-సర్దార్ పటేల్‌నగర్‌లో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని మేకలమండి-సర్దార్ పటేల్‌నగర్ కొన్ని రోజులుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీ మురుగునీటితో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్తీలోని ప్రధాన రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో స్థానికంగా రాకపోకలు సాగించలేని దుర్భర పరిస్థితి నెలకొంది. దీనికి తోడు స్థానికంగా పందుల సంచారంతో పరిసర ప్రాంతాలు మరింత దుర్గంధభరితంగా మారుతున్నాయి. 25 రోజులుగా డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



తగిన చర్యలు తీసుకోవాలి..

ఈ డ్రైనేజీ మురుగునీటి కారణంగా తాము ఎలాంటి రోగాల బారిన పడాల్సి వస్తుందోనని స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మురుగునీటిపై దోమలు వ్యాప్తి చెందడంతో రాత్రి సమయాల్లో తమకు కంటి మీద కునుకు లేకుండా పోతుందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ప్రజలు ఎలాంటి రోగాల బారిన పడకముందే తగిన చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి..



మా బస్తీలో 25 రోజులకు పైగా డ్రైనేజీ పైప్‌లైన్ పగిలిపోయి రోడ్డుపై డ్రైనేజీ మురుగునీరు ప్రవహిస్తుంది. దీనిపై సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేశాం. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రజలు రోగాల బారిన పడకుముందే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ మురుగునీటి సమస్యను పరిష్కరించాలి.

-నరేశ్, సర్దార్ పటేల్‌నగర్

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం..

మేకలమండి-సర్దార్ పటేల్‌నగర్ డ్రైనేజీ పొంగిపొర్లుతున్న విషయం మా దృష్టికి వచ్చింది. కాగా స్థానికంగా ఉండే వారు డ్రైనేజీ పైప్‌లైన్‌పైన బోర్ వేయడంతో పగిలిపోయింది. దీంతో వారు రెండు, మూడు రోజుల్లో పగిలిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్ స్థానంలో నూతన పైప్‌లైన్ వేస్తామని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి పనులను చేపట్టకపోవడంతో జలమండలి ఆధ్వర్యంలో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం.

- సయ్యద్ ముఖరం బాబా, అలియాబాద్ సెక్షన్ మేనేజర్

ఉద్యోగుల బకాయిలను ఇప్పించేందుకు కృషి



ఎస్‌ఎం.ముజీబ్ హుస్సేని

అబిడ్స్: ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే ఇప్పించేందుకు కృషి చేస్తానని హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. నగరంలోని పలు ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ఎస్ఎం.ముజీబ్ హుస్సేనిని కలిసి గత 10 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, మెడికల్ రియింబర్స్‌మెంట్, సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల బకాయిలు సకాలంలో రాకపోవడంతో హైదరాబాద్‌లో ఉన్న లక్షలాది మంది ఉద్యోగులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎం.ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ..ఉద్యోగుల బకాయిల సమస్యలను తన దృష్టికి తెచ్చారని వెంటనే చీఫ్ సెక్రెటరీ పలు సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి విడుదల చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

‘ఒవైసీ ఎలాంటి అభివృద్ధి చేయలేదు’



గోషామహల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చిల్లి గవ్వకూడా అభివృద్ధి చేయలేదని బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. హైదరాబాద్ నలుమూలలా ఎక్కడైనా అసదుద్దీన్ ఒవైసీ అభివృద్ధి చేసినట్లయితే ప్రజలకు పూర్తి వివరాలతో వివరించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం గోషామహల్, ఆర్యసమాజ్, ఎల్ఎంజీ స్కూల్, సీతారామ్‌పేట్, మచ్చిపురా తదితర ప్రాంతాల్లో ఆయన ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. వాడవాడలా గడ్డం శ్రీనివాస్ యాదవ్‌కు ప్రజలు పూల వర్షం కురిపిస్తూ బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మతం పేరు చెబుతూ ఓట్లు దండుకుంటున్నారే తప్పా ప్రజలకు ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. మతోన్మాద మజ్లిస్, బీజేపీలను ఈ ఎన్నికల్లో నామ రూపాలు లేకుండా చేయాలన్నారు. తనను గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు సుశీల్, కోటి శైలేష్ కురుమ, చారి, వినోద్ యాదవ్, నరేందర్ యాదవ్ పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి



గోల్కొండలో ప్రచారంలో ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మరోసారి పోటీ చేస్తున్న సిట్టింగ్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఓటర్లను కోరారు. శుక్రవారం ఆయన గోల్కొండ, టోలిచౌకీ డివిజన్లలో ఇంటింటికీ తిరిగి ప్రచారాన్ని చేపట్టారు. అసదుద్దీన్ ఒవైసీ చొరవతో కార్వాన్ నియోజకవర్గంలో వందల కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని ఆయన అన్నారు. పేద మైనార్టీలు, దళితుల కోసం ప్రభుత్వ సంక్షేమాలు అందించేందుకు మజ్లిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, మహ్మద్ నజీబ్, వజీఉజ్‌జమా, షకీల్ పహిల్వాన్, సయ్యద్ ఆజామ్ తదితరులున్నారు.

‘హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తీరుతా’



ఇంద్రానగర్‌లో ప్రచారం చేస్తున్న మాధవీలత, లక్ష్మీనారాయణ

జియాగూడ: హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో గెలిచి తీరుతానని బీజేపీ అభ్యర్థి మాధవీలత అన్నారు. శుక్రవారం సాయంత్రం జియాగూడలోని లక్ష్మీనరసింహానగర్, రంగనాథనగర్, వడ్ల బస్తీ, కంచెర బస్తీ, మల్లన్న గుడి, ఇందిరానగర్, మక్బర తదితర ప్రాంతాల్లో ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, శివ యాదవ్, సీనియర్ నాయకులు సుదర్శన్ ముదిరాజ్, తులసీదాస్, రాజేందర్ డెగాన్, మనోహర్ థాత్రే తదితరులు పాల్గొన్నారు.

10న ఫిల్మ్ యాక్టింగ్ శిక్షణా తరగతులు ప్రారంభం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నాంపల్లి ప్రాంగణంలో రంగస్థల కళల శాఖ పక్షాన ఫిల్మ్ యాక్టింగ్ గురించి వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. నటన పట్ల ఆసక్తి కలిగిన ఔత్సాహిక విద్యార్థులకు 30 రోజుల పాటు శిక్షణా తరగతులను నిర్వహించి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ శిక్షణా తరగతుల్లో చేరాలనుకునే వారు పదవ తరగతి పాసై ఉండాలి. మే 10వ తేదీ నుంచి ప్రారంభించబడే కోర్సు మొత్తానికి కలిపి రూ.5వేలు ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. సంబంధిత డిమాండ్ డ్రాఫ్టును రిజిస్ట్రార్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరిట చెల్లించాలి. వివరాలకు 93464 61733లో సంప్రదించవచ్చు.

ఉత్సాహంగా కేటీఆర్ రోడ్ షో..





నాంపల్లి నియోజకవర్గం నోబుల్ టాకీస్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి కేటీఆర్ రోడ్ షో నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌కు మద్దతు పలకాలని కోరారు. కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. దీంతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- సాక్షి, సిటీ బ్యూరో

వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



రెండవ పే రివిజన్ కమిషనర్‌తో సమావేశమైన మహ్మద్ రహ్మత్ అలీ

అబిడ్స్:వాణిజ్య పన్నుల శాఖలో దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ రహ్మత్ అలీ, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వాణిజ్య పన్నుల ఉద్యోగుల సమస్యలపై బీఆర్‌కేఆర్ భవన్‌లో రెండవ పే రివిజన్ కమిషన్ కమిటీ కమిషనర్ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎన్.శివ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల ప్రతిపాదనలను, ఉద్యోగుల సమస్యలను పరిష్కారం చేయాలన్నారు. రెండవ పే రివిజన్ కమిషన్ కమిటీ ఉద్యోగులకు న్యాయం చేస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

‘రజాకార్ హైదరాబాద్ వర్సెస్ వికసిత్ హైదరాబాద్’పై సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మాధవీలత

అబిడ్స్: ప్రజ్ఞా భారతి, మోదీ పరివార్ ఆధ్వర్యంలో సిద్దంబజార్‌లోని హోటల్ రాజధానిలో రజాకార్ హైదరాబాద్ వర్సెస్ వికసిత్ హైదరాబాద్‌పై సదస్సు నిర్వహించారు. ప్రజ్ఞా భారతి చైర్మన్ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విరించి ఆసుపత్రి చైర్‌పర్సన్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవీలత, రాజకీయ ఆనలిస్ట్, రచయిత శాంతను గుప్తా, సోషల్ యాక్టివిస్ట్ షజియా ఇల్మి, రజాకార్ సినిమా నిర్మాత గూడూరు నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ..భారతీయ సంస్కృతి సంప్రదాయాలను కాపాడేందుకు ప్రతి హిందూవు పాటుపడాలని కోరారు. పదేళ్లల్లో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నా పాతబస్తీలో మాత్రం అభివృద్ధి జాడ కనిపించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మోదీ పరివార్‌కు చెందిన సురేందర్ పోరెడ్డి, మేఘన జైన్ తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



గోల్కొండ: వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలన్నదే తమ అభిమతమని సకీనా ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ ఆసీఫ్‌హుస్సేన్ సోహెల్ అన్నారు. షేక్‌పేట్ డివిజన్ విరాట్‌నగర్ కుంటలో సకీనా కేంద్రంలో చదవడం, రాయడం నేర్చుకున్న వారికి శుక్రవారం స్టడీ మెటీరియల్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలైన దినసరి కూలీలు, కార్మికులకు చదువు రాకపోవడంతో వారు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారన్నారు. వారిని గుర్తించి చదువు చెప్పించడం కోసం స్లమ్ టూ ఆక్స్‌ఫర్డ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అస్పాక్

గోల్కొండ: హజ్ యాత్రికుల కోసం నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ క్యాంప్‌ను విజయవంతం చేయాలని సౌత్ వెస్ట్ జోన్ అదనపు డీసీపీ మహ్మద్ అస్పాక్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఈ సంవత్సరపు హజ్ యాత్రకు ఎంపికైన వారి కోసం ఏర్పాటైన వ్యాక్సినేషన్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన కేంద్రం అధికారులు, వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. మొదటిసారిగా గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని హజ్ యాత్రికుల హెల్త్ షీట్ ముందుగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఆర్ఎంఓ డాక్టర్ వినాయక్‌రావు, ఏఓ డాక్టర్ శ్రీనివాస్‌రావు, పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు ఆబిద్ తదితరులున్నారు.

ఈటల రాజేందర్‌కు కురుమ సంఘాల మద్దతు



ఈటలకు మద్దతు తెలుపుతున్న కురుమ సంఘాల నాయకులు

గోల్కొండ: మల్కాజిగిరి నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్‌కు కురుమ సంఘాలు ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతున్నాయని రాష్ట్ర కురుమ సంఘం నాయకుడు, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంపెన్ ఇన్‌చార్జి దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కురుమ సంఘాల నాయకులతో కలిసి ఆయన ఈటల రాజేందర్‌ను కలిసి గొంగలి వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ..గత గురువారం జరిగిన కురుమల ఆత్మీయ సమావేశంలో మల్కాజిగిరి నియోజకవర్గానికి చెందిన కురుమ సోదరులే కాకుండా తెలంగాణలోని వివిధ జిల్లాల కురుమ సోదరులు పాల్గొని తనకు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



సరిత సమక్షంలో పార్టీలో చేరిన మహిళలు

చాంద్రాయణగుట్ట: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిపెట్టిన కేసీఆర్ నాయకత్వాన్నే ఇప్పటికీ ప్రజలు కోరుకుంటున్నారని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు చెన్నయ్యగారి సరిత అన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లోని లక్ష్మీనగర్, శివాజీనగర్‌లకు చెందిన పలువురు ఆమె సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..14 ఏళ్ల పాటు ఉద్యమం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కాంక్ష నెరవేర్చిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌దేనన్నారు. హామీల ముసుగులో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నాలుగు నెలల్లోనే ప్రజా నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో ఎంపీ సీట్లు గెలువనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకురాలు మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు ఉచిత శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: పదో తరగతి ఉత్తీర్ణులు కాక నిరాశలో ఉన్నవారికి ఆత్మ విశ్వాసం, ధైర్యం కలిగించి, విలువైన విద్యా సంవత్సరం వృథా కాకుండా రాబోయే సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు ఉచితంగా శిక్షణ, కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు కార్వాన్‌లోని అరస్తు జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య బ్రహ్మేంద్ర తెలిపారు. ఎవరూ నిరాశా నిస్పృహలకు లోనుకావొద్దని సూచించారు. వివరాలకు 93955 77108లో సంప్రదించాలని కోరారు.

బంగారు తాపడం పనులకు రూ. లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు రూ. లక్ష విరాళాన్ని అందజేశారు. హైదరాబాద్ షేక్‌పేటకు చెందిన యునైటెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కట్ట శ్రీనివాస్ రెడ్డి కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి వచ్చింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ. 1,00,116 విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఏఈవో ఎన్. రమేష్ బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను బహూకరించారు.

రూ.10 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్

గన్‌ఫౌండ్రీ: న్యూ ఉస్మాన్‌గంజ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ అబ్దుల్ నజీర్ రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుపడ్డాడు. శుక్రవారం ఏసీబీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ ఉస్మాన్‌గంజ్ మార్కెట్‌లో ఒక దుకాణానికి అనుమతి ఇచ్చేందుకు గాను రూ.10 వేల లంచం అడిగాడు. దుకాణ యజమాని ఇచ్చిన సమాచారం మేరకు లచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

శీతల పానీయాలకు భలే గిరాకీ



చార్మినార్ వద్ద..



శాలిబండ వద్ద..

చార్మినార్: ప్రస్తుతం ఎండలు మండిపోతున్నాయి. మండే ఎండల నుంచి ఉపశమనం కోసం ప్రజలు చల్లని పానీయాల వైపు పరుగులు తీస్తున్నారు. దీంతో ప్రస్తుతం సంప్రదాయ శీతల పానీయాలకు డిమాండ్ పెరిగింది. కూల్ డ్రింక్స్ కాకుండా సంప్రదాయ శీతల పానీయాలను తీసుకోవడం కోసం ఎక్కువగా ఇష్టపడుతున్నారు. దీంతో పాత నగరంలోని ఏ ప్రధాన కూడలి చూసినా కొబ్బరి బోండా, చెరుకు రసం, పుచ్చకాయల రసం, లస్సీ, ఫాలుదా, షర్బత్, మజ్జిగ దుకాణాల వద్ద సందడి కనిపిస్తోంది. సీజనల్ వ్యాపారులు ముఖ్యకూడళ్లలో ఈ పానీయాలను తయారుచేసి అందిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రకరకాల శీతల పానీయాలు లభిస్తున్నాయి. బాటిళ్లలో నిలువ చేసే శీతల పానీయాల్లో ఆరోగ్యానికి హానికరమైన రసాయనాలుంటున్నాయనే ప్రచారం జరుగుతుండడంతో.. వీటికి ఆదరణ లభిస్తోంది. పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో శీతల పానియాలకు గిరాకీ పెరిగింది. మక్కా మసీదు, పురానాపూల్, చార్మినార్, మదీనా, శాలిబండ, షంషీర్‌గంజ్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, బార్కాస్, సంతోష్‌నగర్, కంచన్‌బాగ్ తదితర ప్రాంతాల్లో శీతల పానీయాల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి.

హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా రాహుల్



గౌలిపురా: హైదరాబాద్ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా గౌలిపురాకు చెందిన ముతా రాహుల్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు మోత రోహిత్ చేతుల మీదుగా రాహుల్ నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ముతా రాహుల్ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పటిష్టత కోసం కృషి చేస్తామని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు జాతీయ, రాష్ట్ర నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జూ పార్క్‌లో విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ శిబిరం



క్యూరేటర్ నాగమణి, అసిస్టెంట్ క్యూరేటర్ బి.లక్ష్మణ్, జు పీఆర్ఓ హనీఉల్లా, ఈఓ దీపక్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బహదూర్‌పురా: నెహ్రూ జులాజికల్ పార్క్‌లో పాఠశాల విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ శిబిరాన్ని జుపార్క్ క్యూరేటర్ డాక్టర్ సునిల్ హిరేమత్ శుక్రవారం బయోస్కోప్‌లో ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు జూ ప్రాధాన్యత వన్యప్రాణుల ఆవాసాలు జీవన విధానంపై అవగాహన కల్పించారు. జూలోని సారీ సుపాలు ఇతర జంతువుల ఎంక్లోజర్లను విద్యార్థులకు చూపిస్తూ శిక్షణను ఇచ్చారు. నెహ్రూ జులాజికల్ పార్క్ వినోదమే కాకుండా జ్ఞాన బండారాన్ని అందించే విధంగా జు పార్కును అన్ని విభాగాలుగా తీర్చిదిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జూ పార్కు డిప్యూటీ

ఓటరు స్లిప్పుల పంపిణీ



గౌలిపురా: గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికలను పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ అధికారులు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ భారతి, బీఎల్ఓలు ప్రభారాణి, రవి, శ్రీనివాస్, సంతోష తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



వేడుకల్లో పాల్గొన్న లక్ష్మీనారాయణ తదితరులు

అబిడ్స్: కార్మికులకు అండగా వాటర్‌బోర్డు ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం ముందుంటుందని యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.లక్ష్మీనారాయణలు పేర్కొన్నారు. వాటర్‌బోర్డు కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉద్యోగులు కార్మిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్రో వాటర్‌బోర్డు పరిధిలోని కార్మికులు, ఉద్యోగులకు అండగా నిలిచి వారి ప్రగతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కె.ఆనంద్‌రెడ్డి, పి.వేణుగోపాల్, కుమార్, కృష్ణ, ఎల్లయ్య, పద్మారావు, నరేష్, జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

సంతోష్‌నగర్: అక్రమంగా మద్యాన్ని సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 40 బాటిళ్ల క్వార్టర్ ఛీప్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం..చంపాపేట్ రాజిరెడ్డినగర్‌కు చెందిన బి.గోపికృష్ణ (33) శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో మద్యం బాటిళ్లు (40 క్వార్టర్ ఛీప్ లిక్కర్‌ను)ను తీసుకెళ్తుండగా ఐఎస్‌సదన్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా సంతోష్‌నగర్ పీఎస్ పరిధిలోని కుమ్మర్‌వాడిలో నివాసముండే సంజీవ్ కుమార్‌కు అందజేస్తానని తెలిపాడు. దీంతో గోపికృష్ణను అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.